ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 15 ఆగస్టు 2024



దేశ విభజన వెతలను మరువరాదు: డీఆర్ఎం

గుంతకల్లు, ఆగస్టు14: స్వాతంత్ర్యం పొందిన సందర్భంగా జరిగిన దేశ విభజన సమయంలో ఏర్పడిన కష్టాలను గుర్తుంచుకుని సమైక్య భావనను పెంపొందించుకోవాలని డీఆర్ఎం విజయకుమార్ సూచించారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని రైల్వే శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం హర్రర్స్ ఆఫ్ పార్టిషన్‌ను నిర్వహించారు. రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్థులు దేశ విభజనకు సంబంధించి నృత్య, సంగీత రూపకాలను ప్రదర్శించారు. వారి ప్రతిభను కొనియాడిన డీఆర్ఎం, రూ.10 వేల బహుమతిని ప్రకటించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, ఏపీఓ మధుసూదన రావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సొబగులు

- ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి కేశవ్





త్రివర్ణ కాంతుల క్లాక్ టవర్



హర్ ఘర్ తిరంగా..! అమ్మితేనే ఆకలి తీరేది..! కొంటేనే.. ఆనందం కలిగేది..!

అనంతపురం క్రైం, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాలకు పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. తొలిసారిగా ఆర్థిక మంత్రి హోదాలో పయ్యావుల కేశవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉదయం 8-45 గంటలకు, మంత్రి కేశవ్ 8-58 గంటలకు పరేడ్ మైదానానికి చేరుకుంటారు. 9-02 గంటలకు మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా అభివృద్ధి గురించి ప్రసంగిస్తారు. 10-15 గంటల నుంచి పావు గంటపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, అవార్డులను అందజేస్తారు. కలెక్టర్, ఎస్పీ మురళీకృష్ణ పరేడ్ మైదానాన్ని బుధవారం పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయించారు. వేడుకల నేపథ్యంలో వివిధ శాఖలు ప్రభుత్వ పథకాలను తెలియజేసే శకటాలు, స్టాల్స్‌ను సిద్ధం చేశాయి. వేడుకల నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్, క్లాక్ టవర్‌ను మూడు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వేడుకలకు సిద్ధమయ్యాయి.

శరవేగంగా స్టాప్‌లాగ్ పనులు: కేశవ్



మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

అనంతపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేట్ స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి వృథాను అరికట్టేందుకు స్టాప్ లాగ్‌ల తయారీ బాధ్యతలను మూడు కంపెనీలకు అప్పగించామని అన్నారు. అందులో ఒకటి గురువారం ఉదయానికి సిద్ధమవుతుందని తెలిపారు. జిందాల్ కంపెనీ సహకారంతో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉధృతంగా పారే నీటికి అడ్డుకట్ట వేసే సాహసోపేత కార్యక్రమం ఇది అని అన్నారు. నీటి వృథాను అరికట్టి, అనంత, కర్నూలు రైతాంగానికి ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు.

జేసీ హరిత నియామకం రద్దు

అనంతపురం టౌన్, ఆగస్టు 14: జేసీ హరిత నియామకానికి బ్రేక్ పడింది. బదిలీ అయిన జేసీ కేతన్ గార్గ్ స్థానంలో ఆమెను నియమిస్తూ ఈ నెల 10న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతలోనే ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ, జీఏడీ రిపోర్ట్ చేసుకోవాలని సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా ఆ పార్టీ నాయకులకు హరిత పనులు చేసిపెట్టారని, అందుకే అధికార పార్టీ నాయకులు ఆమె నియామకం పట్ల అభ్యంతరం తెలిపారని ప్రచారం జరుగుతోంది.

సీఐడీ ఎటాచ్‌మెంట్‌లోని భూమిని ఎలా కొంటారు..?

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం అర్బన్, ఆగస్టు 14: సీఐడీ ఎటాచ్‌మెంట్‌లోని అగ్రిగోల్డ్ భూమిని ఎలా కొంటారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేసిన అక్రమాలు ఒక్కొక్కటీ బయటకు వస్తున్నాయన్నారు. విజయవాడ రూరల్‌లోని అంబాపురం గ్రామంలో సీఐడీ ఎటాచ్‌మెంట్‌లోని అగ్రిగోల్డ్ భూమిని మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజు, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు పేర్ల మీద కొనుగోలు చేశారన్నారు. ఈ అక్రమాలపై అగ్రిగోల్డ్ సంస్థ ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసి జోగి రాజును అదుపులోకి తీసుకున్నారన్నారు. చట్టబద్ధంగా జోగి రాజును అరెస్టు చేస్తే, తన కుమారుడు బీసీ బిడ్డను అన్యాయంగా అరెస్టు చేశారంటూ మాజీ మంత్రి కపటనాటకాలు ఆడటం దారుణమన్నారు. వైసీపీ హయాంలో బీసీల హత్యలు, దాడులు జరిగినపుడు బీసీలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, ఆగస్టు 14: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌పై సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ బుధవారం ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా ఎమ్మెల్యే బంధువుల పేరుతో రేషన్ బియ్యం విక్రయించే వారిని, కోళ్ల వ్యాపారం చేసే వారిని బెదిరించినట్లు ఆడియోలతో సోషల్ మీడియా ద్వారా అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ఎస్పీ సందిస్తూ.. ఈ ఫిర్యాదుపై వెంటనే దర్యాప్తు చేసి ఇలాంటి ప్రచారం చేసేది ఎవరన్నది గుర్తించి, కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాగార్జున, నారాయణస్వామి, గోపాల్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 14: పోలీసు పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీకృష్ణ ఆహ్వానించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్, ఎస్పీ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, ఆగస్టు 14: గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడ్డారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హాజరై భూ సమస్యలు, పింఛన్లు, విద్యుత్, రహదారి సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో అర్హులకు ప్రభుత్వ పథకాలు నిలిపివేశారన్నారు. అధికారుల్లో మార్పు రావాలన్నారు. బాధ్యతగా పని చేయకపోతే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు అందించిన ఫిర్యాదులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపీటీసీ జాఫర్, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, గంగలకుంట రమణ పాల్గొన్నారు.

జిల్లాకు రప్పించండి..

అనంతపురం అర్బన్: ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. బుధవారం అనంతపురంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, నాయకులు తిరుపతయ్య, భాస్కర్ నాయక్, శేషు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిశారు. నారాయణస్వామి, నాగ జ్యోతి, శ్యామల, జ్యోతి, చైత్ర, చౌడేశ్వరి, గాయత్రి, పద్మ, అపర్ణ, నిర్మల పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి: వీసీ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 14: వర్సిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు సూచించారు. బుధవారం ఓఎస్డీ టు వీసీగా ప్రొఫెసర్ దేవన్న బాధ్యతలు స్వీకరించారు. ఆయనను వీసీ, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య అభినందించారు. ప్రతి అంశంపై పట్టుసాధించి పారదర్శకంగా పనిచేసేవారికి నూతన అప్పగించామని, విద్యార్థులకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్లు చంద్రశేఖర్, సుబ్బారెడ్డితోపాటు డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 14: స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ, ఏఐకేఎస్, ఐద్వా, వ్యకాసం, పీఎన్ఎం ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం క్లాక్‌టవర్ కూడలి వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్వహించారు. గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో పోరాడి సాధించిన స్వాతంత్ర్య లక్ష్యాలకు అనుగుణంగా ఉందో లేదో సమీక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... దేశ సంపదకు సృష్టికర్తలైన శ్రమజీవులపై దాడి చేస్తూ కార్పొరేట్ కుబేరులకు ప్రజల ఆస్తులను కట్టబెడుతున్నారన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు దేశభక్తి గీతాలాపనలు చేశారు. వెంకటనారాయణ, నాగభూషణం, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సావిత్రి, చంద్రిక పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా శ్రీకాంత్ బాధ్యతలు

అనంతపురం క్రైం, ఆగస్టు 14: అనంతపురం టూటౌన్ సీఐగా ఎం.శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కాంత్రికుమార్ వీఆర్‌కు తీసుకెళ్తా, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న శ్రీకాంత్‌ను సీఐగా నియమించారు. నూతన సీఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాప్తాడు సీఐగా శ్రీహర్ష

రాప్తాడు: రాప్తాడు సీఐగా టీవీ శ్రీహర్ష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ మునిస్వామి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా డీసీఆర్‌బీలో పనిచేస్తున్న శ్రీహర్షను ఇక్కడికి బదిలీ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు... ఈ రూట్లలో వెళ్లండి

అనంతపురం క్రైం, ఆగస్టు 14: జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించే 78వ స్వాతంత్ర్య వేడుకలకు వచ్చే ప్రముఖులు, ప్రజలు జిల్లా పోలీస్ శాఖ సూచించిన రూట్లలోనే వెళ్లాలని అనంతపురం డీఎస్పీ ప్రతాప్ బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీఐజీ, జిల్లా న్యాయాధికారి, కలెక్టర్, ఎస్పీల వాహనాలు పోలీస్ పెట్రోల్ బంకు ముందున్న రహదారి గుండా వెళ్లాలన్నారు. మిగిలిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల వాహనాలు వేడుకల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు వచ్చే ప్రజల వాహనాలు జడ్పీ కార్యాలయం ముందున్న అంబేడ్కర్ సర్కిల్ మీదుగా డీఎస్పీ ఆఫీస్, జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ రూట్‌లో వెళ్లాలన్నారు. విద్యార్థులు, వీక్షకులు ఉదయం 8.20గంటలకు పరేడ్ మైదానంలో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

బీటెక్ ఫారిన్ కోర్సులకు ప్రవేశాలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 14: జేఎన్‌టీయూలో బీటెక్ ఫారిన్ కోర్సుల ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలుమిని ప్రొఫెసర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, స్వీడన్ సంయుక్తాధ్వర్యంలో బీటెక్ కోర్సులను అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతలో ఖాళీగా ఉన్న సీఎస్ఈ, ఈసీఈ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పించేందుకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 19నుంచి 24వరకు నిర్వహించే ప్రవేశాల ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

బ్యాంకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి

నార్పల, ఆగస్టు 14: పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణాలకు, పశువుల దాణాకు, చేనేత కార్మికులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. నార్పల స్టేట్‌బ్యాంక్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం అధ్యక్షుడు మధుయాదవ్, గంగాధర్, శివారెడ్డి, లలితమ్మ, చాపల రామాంజి, సుధాకర్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 14: 104 సంవత్సరాల వయసులో వయోభారంతో మృతిచెందిన శతాధిక అనాథ వృద్ధురాలికి ఆదరణ సేవాసమాజ్ ట్రస్టు, ఫ్రెండ్స్ సొసైటీ, సహృదయ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. హౌసింగ్‌బోర్డులో వెంకమ్మ(104) ఒంటరిగా నివసిస్తుండేది. బుధవారం ఆమె మృతిచెందడంతో స్థానికులు గమనించి ఆదరణ సేవా సమాజ్ ట్రస్టుకు సమాచారమందించారు. ట్రస్టు నిర్వాహకుడు తాడిమర్రి లాల్‌బాషా నేతృత్వంలో పలువురు అక్కడికి చేరుకుని ఆమె భౌతికకాయాన్ని హౌసింగ్‌బోర్డు శ్మశానవాటికకు తరలించి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

డొక్కా సీతమ్మ భోజనశాల సందర్శనకు అవకాశం

అనంతపురంరూరల్, ఆగస్టు 14: జిల్లాలో రానున్న పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను లంకల గన్నవరంలోని డొక్కా సీతమ్మ భోజనశాల సందర్శనకు అవకాశం కల్పిస్తున్నట్లు చియ్యేడు పాఠశాల ఉపాధ్యాయులు, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద నాగేంద్ర తెలిపారు. ఆమేరకు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 2024-25 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని పది మంది విద్యార్థులను, చియ్యేడు పాఠశాలలో 550మార్కులకుపైగా సాధించిన వారిని తూర్పుగోదావరి జిల్లా లంకల గన్నవరం గ్రామంలోని డొక్కా సీతమ్మ నిత్య అన్నదాన భోజనశాల సందర్శనకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తున్నట్లు తెలిపారు.

పరేడ్ ఫైనల్ ప్రాక్టీసులో మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ రిహార్సల్స్‌లో జిల్లా మాజీ సైనికులు పాల్గొన్నారు. బుధవారం ఏఆర్ డీఎస్పీ మునిరాజు సూచనల మేరకు జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో పరేడ్ ఫైనల్ ప్రాక్టీసు చేశారు. కెప్టెన్ షేకన్న జాతీయ జెండాతో పరేడ్ ప్రారంభించి తగిన సూచనలు, సలహాలు అందించారు. మాజీ సైనికులు కెప్టెన్ ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, కుమారస్వామి, మణికుమార్ పాల్గొన్నారు.

గౌరవ ప్రతీకలను ప్రదర్శించాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 14: దేశంలోని ప్రతి భూభాగం అస్తిత్వాన్ని కలిగివుందని, వాటి గౌరవ ప్రతీకలను ప్రదర్శించి నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరముందని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీని ఆయన ప్రారంభించారు.

జేఎన్‌టీయూలో బైక్ ర్యాలీ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 14: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'హర్‌ఘర్ తిరంగా ర్యాలీని' నిర్వహించారు. కళాశాలనుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ ప్రారంభించి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ఐక్యతను చాటాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మమత, బాలనసరయ్య, కళ్యాణిరాధ, ఓంప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ధర్మవరంరూరల్(కనగానపల్లి), ఆగస్టు 14: పాఠశాలలో కలిసి మెలిసి తిరిగిన తమ మిత్రుడు అకాల మరణం చెందడంతో, ఆ కుటుంబం వీధినపడకుండా తోడుంటామని స్నేహితులంతా ముందుకు వచ్చారు. కనగానపల్లికి చెందిన సాకే నాగేంద్ర ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. నాగేంద్రకు భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్నేహితులు బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.60,500 నగదుతో పాటు 50 కిలోల బియ్యంప్యాకెట్, నిత్యావసర సరుకులు అందజేశారు. బట్టారాజేష్, అంకే హరి, నాగమునీంద్ర, విజయ్, గోవిందు, నాగరాజు, నాగేష్ ఉన్నారు.

క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం

● బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



బాస్కెట్‌బాల్ సింథటిక్ కోర్టును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్ టవర్, ఆగస్టు 14: క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బుడ్డప్పనగర్‌లోని రాజేంద్రనగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడానైపుణ్యానికి కొదవలేదని, క్రీడలను, క్రీడాకారులను మరింత ప్రోత్సాహిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. డీఎస్‌డీఓ షఫీ, నగరపాలక కమిషనర్ మూర్తి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నరేంద్ర చౌదరి, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

జీవో 117 మేరకు సర్దుబాటు సరికాదు

అనంతపురం విద్య: ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తోందని, జీవో 117 టీచర్ల సర్దుబాటు సరికాదని, పునరాలోచించాలని ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు, టీచర్లు ఎమ్మెల్యేను కోరారు. బుధవారం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను వారు కలిశారు. వారు మాట్లాడుతూ జీఓ 117 ప్రకారం ఇంటర్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే అనేక మంది టీచర్లు మిగులు జాబితాలో చేరతారన్నారు. ఆ జీవోను రద్దు చేసిన తర్వాత సర్దుబాటును కొనసాగించాలని సూచించారు. సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. రామాంజనేయులు, ఓబులేసు, నాగేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి, యుగంధర్, శ్రీనివాసులు, లోకయ్య, రవీంద్ర పాల్గొన్నారు.































టీబీపీ గేట్ మీట్

- స్టాప్‌లాగ్, క్రస్ట్‌గేట్ ఏర్పాటుకు ఉన్నతస్థాయి కమిటీ
- డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్ బాధ్యత కమిటీకి..
- 1,621 అడుగుల లెవల్‌లో స్టాప్‌లాగ్ గేటు
- సాధ్యం కాకపోతే 1,617 అడుగులకు తగ్గింపు
- తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అత్యవసర సమావేశం
- వర్చువల్ భేటీలో కీలక నిర్ణయాలు



క్రస్ట్ గేట్ల నుంచి నీటి ప్రవాహం

కర్నూలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు పునరుద్ధరణ, తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు, డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్ వంటి వాటి కోసం ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీని నియమిస్తూ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) నిర్ణయం తీసుకుంది. బోర్డు చైర్మన్ వీరేంద్ర శర్మ అధ్యక్షతన బుధవారం రాత్రి వర్చువల్ విధానంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ నెల 10న శనివారం రాత్రి ఎత్తిన గేట్లను దింపుతుండగా చైన్‌లింక్ తెగిపోయి 19వ గేటు వరదకు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. గేటు పునరుద్ధరణ, తాత్కాలిక స్టాప్‌లాగ్ ఏర్పాటుపై బోర్డు సభ్యులుగా ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గేట్ల నిపుణుడు, సలహాదారులు కన్నయ్యనాయుడు ఆదివారం రాత్రికే టీబీపీ డ్యాం చేరుకొని స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తయారీ, ఏర్పాటుపై దృష్టి సారించారు. ఏపీ ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయిప్రసాద్ బోర్డులోనే తిష్టవేసి స్టాప్‌లాగ్ గేటు అమర్చే పనులు పర్యవేక్షిస్తున్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు డ్యాంను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అదే క్రమంలో గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడు ఇప్పటికే టీబీపీ బోర్డు అధికారులు, ఇంజనీర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో బోర్డు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

టీబీపీ బోర్డు నిర్ణయాలు

- స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు, గేటు పునరుద్ధరణ, ఇతర పనుల కోసం టీబీపీ బోర్డు సెక్రటరీ, బోర్డు ఐబీ సీఈ, ఎస్ఈ, హెచ్చెల్సీ డివిజన్ ఈఈ మొత్తం నలుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు. ఈ కమిటీ ఆమోదంతోనే గేటు డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్, అవసరమైన పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు ఇవ్వాలి. పురోగతి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. సకాలంలో పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిర్ణయాలు, సాంకేతిక సమస్యలు తలెత్తితే నిపుణులను సంప్రదించడం, థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ నియమించడం కమిటీ బాధ్యత.



టీబీ డ్యాం

- టీబీ డ్యాం స్పిల్‌వే లెవల్ 1,613 అడుగులలో 43 టీఎంసీలు, 1,617 అడుగుల్లో 54 టీఎంసీలు, 1,621 అడుగులలో 63 టీఎంసీ నీటి నిల్వ ఉంటుంది. డ్యాంలో ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు కాపాడుకునేలా 1,621 అడుగుల లెవల్‌లో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు చేయాలి. అది సాధ్యం కాకపోతే 1,617 అడుగులకు స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి.. వీలైనంత మేర నీటిని ఆదా చేయాలి.
- గేటు కొట్టుకుపోయిన తక్షణమే డ్యాం గేట్స్ ఎరెక్షన్‌లో అనుభవం కలిగిన గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడును సంప్రదించగా.. ఆయన తాత్కాలిక పునరుద్ధరణ కోసం ఐదు సెగ్మెంట్లలో స్టాప్‌లాగ్ గేట్ల కోసం డిజైన్, డ్రాయింగ్ ఇచ్చారు. ఆమేరకు పనులు చేసి.. నీరు క్రెస్ట్ స్థాయికి దిగువకు తగ్గిన వెంటనే శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాలి.
- స్టాప్‌లాగ్ ఏర్పాటు కోసం దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు అవుతుంది. అత్యవసర ప్రాతిపదికన తాత్కాలిక పునరుద్ధరణ కోసం పరిపాలన అనుమతులు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నాన్-ప్లాన్ గ్రాంట్ ఏపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. గేటు పునరుద్ధణకు అవసరమైన నిధులు హెచ్చెల్సీ, ఎల్లెల్సీ హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు ఏపీ, కర్ణాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆమోదం తెలిపారు.
- గేటు తెగిపోయిన సమయంలో 1,633 అడుగుల లెవల్‌లో 105.788 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. మూడు రోజుల్లో 13 టీఎంసీలు విడుదల చేస్తే.. మరో మూడు రోజుల్లో 40 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. అప్పుడు 1,621 అడుగుల స్థాయికి చేరుకుంటుంది. అప్పుడే స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు తరువాత ఈ వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు డ్యాంను నింపడానికి ప్రయత్నం. గేట్ పునరుద్ధరణ, స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటుపై గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్య నాయుడు ఎలాంటి సూచన చేసినా కమిటీ పరిశీలించాలి.
- గేటు కొట్టుకుపోవడానికి కారణాలు తెలుసుకోవడానికి మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేయాలని బోర్డు చైర్మన్ ప్రతిపాదనను ఆమోదించారు. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో బోర్డు చైర్మన్ వీరేంద్రశర్మ సహా కర్ణాటక ప్రభుత్వ జలవనరుల శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి బికులకర్ణి, ఏపీ ఇరిగేషన్ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర రావు, తెలంగాణ ఈఎన్‌సీ, బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్విందర్ వోహ్రా, కర్ణాటక అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్‌గుప్తా, ఏపీ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్, బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ప్రజాదర్బార్‌లో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 14: సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు, ప్రజలతో ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను మంత్రి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసానిచ్చారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. మరికొన్నింటినీ సంబంధిత శాఖలకు పంపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్‌రావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడి ఫిరోజ్ ఖాన్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు



అనంతపురం రూరల్, ఆగస్టు 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 423 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురం రూరల్, ఆగస్టు 14: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 4500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 492 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 14: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. రిజర్వాయరులో ప్రస్తుతం 0.354 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

అమెరికా ఆకాశంలో మువ్వన్నెల జెండా



స్కై డైవింగ్ ద్వారా జెండా ఎగురవేస్తున్న అఖిల్



అఖిల్ అభివాదం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14: స్కై డైవింగ్ ద్వారా అమెరికాలో భారత జాతీయ జెండాను జిల్లాకు చెందిన యువకుడు ఎగురవేశాడు. సహకార శాఖలో పనిచేస్తున్న జిల్లాకు చెందిన రమణారెడ్డి కుమారుడు అఖిల్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన దేశభక్తితో ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని వినూత్నరీతిలో తన జాతీయతను చాటుకోవాలని భావించాడు. వాషింగ్టన్‌లో సుమారు 2వేల అడుగుల ఎత్తులో స్కై డైవింగ్ ద్వారా వినూత్న రీతిలో మువ్వన్నెల జెండాను ప్రదర్శించాడు. దీనిపై అతడి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లు ఇకనైనా మారాలి

- మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి



అనంతపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇకనైనా మారాలని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. హైదరాబాదులోని తన నివాసం నుంచి బుధవారం వీడియో విడుదల చేశారు. కొందరు ఐపీఎస్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు మెమోలు జారీ చేయడం పట్ల ఆయన స్పందించారు. రాజకీయ నాయకులుగా తాము కేసుల్లో ఉంటే... షరతులతో కూడిన బెయిల్ కోర్టులు ఇస్తాయని, ఉదయమే స్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెట్టండని కోర్టులు ఆదేశిస్తాయని అన్నారు. ఇలాంటి పరిస్థితి ఐపీఎస్‌లకు రావడం బాధాకరమని అన్నారు. ఐపీఎస్‌లుగా ఉన్న మీకు కండిషన్ బెయి లా..? మాకు కండిషన్ బెయిల్ కోర్టు ఇస్తుంది. మీకు డీజీపీ కండిషన్ బెయిల్ ఇచ్చారు. మేమన్నా స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసి వస్తాం. మీరు సంతకం చేసి అక్కడే ఉండాలట. మమ్మల్ని ఏ విధంగా కష్టపెట్టారో... ప్రజలను ఏ విధంగా కష్టపెట్టారో ఆలోచించుకోండి' అని వ్యాఖ్యానించారు. 'తప్పు చేశారు.. అనుభవించాలనైతే చెప్పనుగాని, కండిషన్‌లు వద్దు వదిలిపెట్టండి.. వీఆర్‌లో పెట్టండి' అని డీజీపీని ఆయన కోరారు.

ప్రత్యేక ప్రణాళికతో అనంత అభివృద్ధి



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అనంతపురం రూరల్, ఆగస్టు 14: ప్రత్యేక ప్రణాళికలతో అనంతను అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూరల్ మండలం అనంతపురం అర్బన్ పరిధిలోని ఎ.నారాయణపురం చెక్ డ్యాంపై వంతెన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట శివుడు యాదవ్, శ్రీధర్‌చౌదరి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భూమి పూజ అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అనేక అంశాలను పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, స్మార్ట్ సిటీ వంటి కార్యక్రమాలు త్వరలోనే ప్రారంభిస్తామ న్నారు. హార్టికల్చర్ దిగుబడులను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ఎయిర్‌పోర్టు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నెలకొన్న బ్రిడ్జి సమస్యకు పరిష్కారం చూపుతున్నామన్నారు. రూ.4.96 కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల కోటంక, మర్తాడు గ్రామాలకు వెళ్లేందుకు దూరం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, టీడీపీ నాయకులు గంగారామ్, రాయల్‌మురళీ, డిష్‌నాగరాజు, ఓబులపతి, నాగరాజు, రఘునాథరాయల్, దళవాయి వెంకటనారాయణ, కుంచెపు వెంకటేష్, లక్ష్మీనరసింహులు, కూచి హరి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చాటుదాం: మంత్రి సవిత

- పెనుకొండలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి సవిత, కూటమి నాయకులు

పెనుకొండ, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రతి భారతీయుడు పాల్గొని, నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చాటుదామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత హాజరై జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి, ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎందరో మహనీయులు త్యాగాలు చేసి, దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టారన్నారు. వారి పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం వాడవాడలా నిర్వహించాలన్నారు. జాతీయ జెండాను ఎగుర వేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కూటమి నాయకులు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

స్ఫూర్తి చిహ్నం

- ఐదు దశాబ్దాల అపురూప జ్ఞాపకం....!
- స్వాతంత్ర్యం సిద్ధించి 25 ఏళ్లు గడిచిన సందర్భంగా ఆవిష్కరణ
- జ్ఞాపకంగా శారద స్కూల్‌లో శిలాఫలకం
- అలనాటి సమరయోధుల ఆవిష్కరణ





అరుదైన శిలాఫలకం

రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యసారాంశం

అనంతపురం విద్య, ఆగస్టు 14: మన దేశ స్వాతంత్ర్య పోరాటం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎందరో సమరయోధుల త్యాగం వల్ల లభించినది నేటి మన స్వాతంత్ర్యం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 25 ఏళ్ల గడిచిన సందర్భంగా అప్పట్లో అనంతపురం నగరంలో వేడుకలు ఘనంగా చేసుకున్నారు. ఇందుకు సాక్ష్యంగా ఒక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇప్పుడు అది 5 దశాబ్దాల పైబడిగా జ్ఞాపకంగా నిలిచింది. అంతటి అపురూప జ్ఞాపకం కూడా ఆదరణ లభించక.... సామాన్య బండగా నిలిచింది.

శారదా స్కూల్‌లో అపురూప జ్ఞాపకం...



ముఖ్యమైన చిహ్నాలు, ముద్రలు

నగరంలోని 1వ రోడ్డులో ఉన్న శారద మున్సిపల్ హైస్కూల్‌లో సుమారు 52 ఏళ్ల కిందట ఒక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ....ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరించా రు. స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంలోని ప్రవేశిక మాటలను గుర్తు చేస్తూ..ఈ శిలాఫలకం ఏర్పాటు చేయించారు. శిలాఫలకం వెనుకవైపు జిల్లాకు చెందిన నాటి ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ నీలం సంజీవరెడ్డి, వరదా చిన్నప్ప, ఐదైకల్లు సదాశివన్, పెద్దగొండి కొండప్ప, ఆర్. లక్ష్మణచార్యులు, వల్లూరు రామారావు, లింగుట్ల వెంకటప్ప,కె.నారాయణప్ప, మేడా వెంకటాచలం, జి. రామక్రిష్ణ, పప్పూరు రామాచార్యుల పేర్లు చెక్కించారు.

ఆదరణ ఏదీ..?



స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల పేర్లు

ఈ అపురూప శిలాఫలకం 5 దశాబ్దాల కిందటిది. శారదా స్కూల్‌లో ఉన్న శిలాఫలకం మన నగరంలో ఉన్న ఇతర ప్రముఖ స్వాతంత్ర్య ఘట్టాలకు సంబంధించిన స్మృతుల్లో ఒకటిగా చెప్పవచ్చు. అంతటి అపురూప జ్ఞాపకంగా నిలిచినా...ఆదరణ లేదని స్పష్టమవుతోంది. స్కూల్ ఆవరణలో ఓ మూలన అలా నిలిచిపోయింది. మన స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తిని, భారత రాజ్యాంగ గాంభీరాన్ని, సార్వభౌమత్వాన్ని చాటి చెప్పేలా నిలిచిన ఈ అపురూప శిలాఫలకాన్ని ఇలా మూలన కాకుండా.. జిల్లా, నగర ప్రజలు, పౌరులు చూసి స్ఫూర్తి పొందేలా ఆదరణ కల్పించాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు ఆ దిశగా అడుగేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

రైతుపై ఎలుగుబంట్ల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు రామన్న

కళ్యాణదుర్గం, ఆగస్టు 14: మండలంలోని ఉప్పొంక గ్రామంలో రామన్న అనే రైతుపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. బాధితుడు తెలిపిన మేరకు... బుధవారం తెల్లవారుజామున వ్యవసాయ తోట వద్దకు బయల్దేరాన్నాడు. దారి మధ్యలో ముళ్లపొదల్లో దాగి ఉన్న రెండు ఎలుగుబంట్లు ఒక్కసారిగా దాడి చేశాయన్నారు. గట్టిగా అరవడంతో అవి సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు తెలిపారు. తన అరుపులు విని వచ్చిన కొంతమంది కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. బాధితుడికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మధ్యకాలంలో కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎలుగు బంట్ల దాడులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. దీంతో రాత్రివేళల్లో వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. అటవీ అధికారులు స్పందించి వన్యమృగాల నుంచి రక్షించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, ఆగస్టు 14: పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, పారామెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గఫూర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2 వరకు గడువు పొడించారన్నారు.

ఇంటర్వ్యూల వాయిదా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 14: ఎస్కేయూలో అకడమిక్ కన్సల్టెంట్‌ల ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు వీర్వో ప్రొఫెసర్ రామగోపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి వర్సిటీలోని పలు విభాగాల్లో అకడమిక్ కన్సల్టెంట్స్‌గా పనిచేసేందుకు 13, 14న వాన్ ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. తెలుగు విభాగంలో ఇంటర్వ్యూలను వాయిదా వేశామని తిరిగి 16న నిర్వహిస్తారని తెలిపారు.

ఎమ్మెల్యే జలహారతి

గుంతకల్లు, ఆగస్టు14: జీ కొట్టాల గ్రామం వద్ద ఉన్న సమ్మర్ స్టోరే జి ట్యాంకుకు హంద్రీనీవా నీటి పంపింగ్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం ప్రారంభించారు. అలాగే జల హారతి నిర్వహించారు. తర్వాత ఎస్ ఎస్ ట్యాంకు వద్ద మొక్కలను నాటారు. అక్కడి నుంచి కసాపురం వద్ద హంద్రీనీవా కాలువపై ఉన్న తూముకు పూజలు చేసి వాల్వును తెరచి నీటిని విడుదల చేశారు. మున్సిపల్ కమిషనరు వెంకట రమణయ్య, హంద్రీనీవా ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస నాయక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో పూజలు

కసాపురం ఆలయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామి దర్శనం, ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత టీడీపీ కార్యకర్త హరి ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించినందుకు మొక్కు చెల్లించాడు. చంద్రబాబు పేరిట 90కిలోల బెల్లంను ఆలయానికి అందజేశారు. అలాగే గుమ్మనూరు జయరాంకు తులాభారం వేసి ఆ తూకం మేరకు బెల్లం సమర్పించారు.

సత్యనారాయణస్వామికి ఎమ్మెల్యే కాలవ పూజలు

బొమ్మనహాళ్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని సత్యనారాయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోనే గోశాలను ప్రారంభించారు. ఆయన వెంట టీడీపీ శ్రేణులు ఉన్నారు.

వైసీపీ నాయకుడి ట్రాక్టర్ పట్టివేత

బొమ్మనహాళ్, ఆగస్టు 14: మండలంలోని కళ్లుదేవనహళ్లి వేదావతినది హగరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వైసీపీ నాయకుడికి చెందిన ట్రాక్టర్‌ను కణేకల్లు సెబ్ అధికారులు బుధవారం పట్టుకుని బొమ్మనహాళ్ పోలీసులకు అప్పగించారు. 'వైసీపీ నాయకుడి ఇసుక దందా' శీర్షికన గత ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన సెబ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో కుండపోత

● పొంగిపొర్లిన వాగులు, వంకలు

రాయదుర్గం, ఆగస్టు 14: రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల దాకా భారీవర్షం కురవడంతో వాగులు, వంకలు వరదనీటితో పొంగిపొర్లాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది. రాయదుర్గం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కొలిమివీధి, సెయింట్‌పాల్ ఏరియా, దాసప్పరోడ్డు ప్రాంతాలలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. ప్రధానంగా ముత్రాసికాలనీ కూడా లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముందస్తుగా కాలువల్లో పూడికతీత పనులు చేయించడంతో నీరు ఇళ్లల్లో చేరలేదు. గుమ్మఘట్టలో 129.2 మి.మీలు, రాయదుర్గంలో 75.6 మి.మీలు, డీ.హీరేహాళ్‌లో 52.0 మి.మీల వర్షం కురిసింది. రాయదుర్గం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు పంటలు నీట మునిగాయి. అన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు చేరింది. గుమ్మఘట్ట మండలంలో చెక్‌డ్యాములు, కుంటలు నిండిపోయాయి. తాళ్లకెర గ్రామంలో బోయ మారన్నకు చెందిన ఇల్లు నేలకూలింది. కాగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కణేకల్లు మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి వేదావతి హగరి పొంగిపొర్లింది. బొమ్మనహాళ్ మండలంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



ఎస్సారమ్మ

గుత్తి, ఆగస్టు 14: పట్టణ శివారులోని లచ్చానుపల్లి రోడ్డులో గల బైబిల్ మిషన్ చర్చికి వచ్చిన ఎస్సారమ్మ అదృశ్యమైనట్లు ఆమె కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా గోనేగండ్ల మండలం పెద్దనెలటూరుకు చెందిన ఎస్సారమ్మ చర్చికి ఈనెల 9వతేదీన వచ్చింది. తిరిగి స్వగ్రామానికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఫిర్యాదు చేయగా గుత్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

పెద్దపప్పూరు, ఆగస్టు 14: మండలంలోని ముచ్చుకోట గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈ రాజశేఖర్, ఏడీ వసంతకుమార్, ఏఈ నరసింహులు, సర్పంచు జయమ్మ, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మొలకతాళ్ల గ్రామంలో ఆగ్రోపా రెస్ట్రీ ప్రారంభోత్సవంలో భాగంగా రైతులకు పండ్లమొక్కల పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరయ్యారు.

ట్రాలీ మీదపడి రైతు మృతి



గుత్తి రూరల్, ఆగస్టు 14: తొండపాడు సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ కింద ఇరుక్కుపోయి రైతు సుంకన్న(45) బుధవారం మృతి చెందారు. పొలం నుంచి గడ్డిని తీసుకొచ్చేందుకు ఒంటరిగా వెళ్లిన సుంకన్న.. ట్రాక్టర్ ట్రాలీ హైడ్రాలిక్ యంత్రం పనిచేయకపోవడంతో సరి చేసే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. పొలం నుంచి ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసి గుర్తించారు. గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్డీవో కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

కళ్యాణదుర్గం, ఆగస్టు 14: కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయానికి ఐఎస్ఓ సంస్థ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లు ఆర్డీవో రాణి సుస్మిత బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను గురువారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా అందుకోనున్నట్లు చెప్పారు.